క్లుప్తంగా

పోచమ్మ విగ్రహావిష్కరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పోచమ్మ తల్లి ఆశీస్సులతో అందరం సంతోషంగా జీవిద్దామని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వార్డు నం .3లోని ఏనుగొండలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్ డిమాండ్ చేశారు. అమ్మాపురంలో ఆదివారం కూలీ పోరాటం కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ కూలీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. కూలీలు, రైతులు తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

చిన్నచింతకుంట: పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. దమగ్నాపురంనకు చెందిన భాస్కర్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 4లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు వివరించారు. ఆదివారం తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందిస్తాం

జడ్చర్ల టౌన్: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి తన సొంత ఖర్చుతో షూ ఇస్తున్నట్లుగానే టై, స్కూల్‌బ్యాగులను సైతం అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం పట్టణంలో ఉపాధ్యాయురాలు సరస్వతి పదవీ విరమణ సభలో పాల్గొని ప్రసంగించారు. పదవీవిరమణ పొందిన వారి స్థానంలో వెంటనే మరొకరు వచ్చే అవకాశం లేనందున.. అప్పటివరకు ఒక సంస్థతో మాట్లాడి గౌరవవేతనం ఇప్పిస్తూ విద్యార్థులకు నష్టం జరగకుండా వారి సేవలు వినియోగించుకొనేందుకు కృషిచేస్తామన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం



రాజాపూర్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరుట్రాక్టర్లతో పాటు ఒక జేసీబీని ఆదివారం రాజాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ రవి వివరాలు తెలిపారు. రాయపల్లి గ్రామ శివారులోని దుందుభీ వాగులో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నట్లు సమాచారం అందినట్లు వివరించారు. తమ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సమాచారం రావడంతో అక్కడకు వెళ్లారన్నారు. ఇసుసు తయారు చేస్తున్న ట్రాక్టర్లను, జేసీబీని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

2 డెంగీ కేసులు నమోదు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌వీ పీనగర్, శివాజీనగర్‌లలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో ఇరువురు చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. చంద్రకళ తెలియజేశారు. జ్వరంతో ఆస్పత్రికి చికిత్సకు రాగా డెంగీ లక్షణాలు గుర్తించి నిర్ధారణ చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు.

బీసీ గురుకులంలో సమస్యలు తీర్చాలి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని పాతబజార్‌లో ఉన్న నవాబుపేట జ్యోతిబాపులే బాలుర బీసీ గురుకులంలో సమస్యలు తీర్చాలని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం గురుకులాన్ని సందర్శించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీళ్ల సక్రమంగా లేకపోవటం వల్ల అన్నం ఉడికి ఉడకనట్లుగా వండి పెడుతున్నారని, వర్షం వస్తే భవనంలోకి నీళ్లు వస్తున్నాయని, కిటికీలకు రెక్కలు లేకపోవటం వల్ల రాత్రిళ్లు దోమలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయినట్లు తెలిపారు. గురుకులానికి వెంటనే స్వంతభవనం నిర్మించి సమస్యలు తీర్చాలన్నారు. కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవిస్తామన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: మండలంలోని నెక్కొండలో ఉన్న పొలంలో అనుమతి లేకుండా మల్లయ్య అనే వ్యక్తి ట్రాక్టరుతో దున్నాడని రాజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్‌ఐ విష్ణు తెలియజేశారు. సర్వే నంబర్ 148ఇ, 128ఇలో 18గుంటల పొలం ఉందని, అదే గ్రామానికి చెందిన మల్లయ్య ఈనెల 19న ట్రాక్టర్ తీసుకువచ్చి దున్నాడని ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు. ఎందుకు దున్నావని అడిగితే బూతులతో దూషించాడని తెలిపినట్లు వివరించారు.



రంగారెడ్డి గూడలో వేడుకలో పాల్గొన్న మహిళలు



జడ్చర్లలో బంగారుమైసమ్మ బోనాల ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో బోనాలు

రాజాపూర్: రంగారెడ్డిగూడలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సునీతా శ్రీనివాస్, రాములుగౌడ్, సంజీవ్ ముదిరాజ్, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ బోనాలు

జడ్చర్ల టౌన్: పట్టణ పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారిపై కావేరమ్మపేట ఐబీ వద్ద ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కావేరమ్మపేట నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ వేరు వేరుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని అదేవిధంగా కోడ్గల్‌లో మహంకాళీ బోనాలు ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



కోడ్గల్‌లో పోతురాజుల సందడి



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

పెద్దగుట్టపై విష్ణు సహస్ర నామ పారాయణం



విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఆలయ పరిరక్షణ కమిటి చేపట్టిన చర్యలు ఫలితాలనిస్తున్నాయి. గుట్టపై 1300 ఏళ్లనాటి కోనేరుకు సైతం పూర్వవైభవం వచ్చినట్లయ్యింది. గుట్టపై ఆలయంలో కొలువైన లక్ష్మీసమేత రంగనాథస్వామి విగ్రహంపై పడిన వర్షపు నీరు కోనేరులోకి వెళ్తున్నాయి. ప్రస్తుతం కోనేరులో నీళ్లు నిండాయి. నీటి ఊట సైతం ప్రారంభం కావటం భక్తులకు ఆనందం కలిగిస్తోంది. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు గుట్టపైకి వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. విష్ణుసహస్రనామ పారాయణం చేపట్టారు. అన్నదానం నిర్వహించారు. పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాల్వ రాంరెడ్డి భక్తులకు కలశంతో స్వాగతం పలుకుతున్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులివ్వండి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న లక్ష్మీ సమేత రంగనాథస్వామి ఆలయాన్ని పుణ్యక్షేత్రంగా మార్చేందుకు నిధులు కేటాయించాలని పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణను నియోజకవర్గ బీజేపీ, ఎస్సీమోర్చా నాయకులు కోరారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమెను కలిసి విన్నవించారు. స్పందించిన ఎంపీ తనవంతుగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ముచ్చర్ల కృష్ణ, వెంకటేశ్, రమేష్, నవీన్, శ్రీనివాసులుగౌడ్ పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీల ఆరాధ్యుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ బీసీల సామాజిక న్యాయానికి ప్రాతిపదిక లభించిందో, బీసీల రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా ప్రారంభం కావడానికి మార్గం సుగం అయిందో, దేశంలోని సగం జనాభా బతుకులు మెరుగు పరుచుకోవడానికి, రాజకీయాలను ప్రభావితం చేయడానికి ఒక ఆసరా దొరికిందో ఆయనే బీపీ మండల్ అని అన్నారు. కార్యక్రమంలో జాంబ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, ముదిరాజ్ సంఘం నాయకులు గంజి ఆంజనేయులు, సీనియర్ న్యాయవాది మద్దూరి కృష్ణ, ఆశన్న ముదిరాజ్, నడిమింటి శ్రీనివాసులు, బాలచందర్, సవారి సత్యం, రుద్రారం సత్యం, నరసింహ, రఘు, కృష్ణ, ఆంజనేయులు సాగర్, తిరుపతయ్య, కుర్వ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: రిజర్వేషన్ల ప్రదాత, మండల్ నివేదిక రూపశిల్పి బిందేశ్వరి ప్రసాద్ మండల్ 106వ జయంతి పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో బీసీలు ఘన నివాళి అర్పించారు. బాదేపల్లి పట్టణంలోని పులే విగ్రహం వద్ద, కావేరమ్మపేట గ్రంథాలయం వద్ద నాయకులు నివాళులు అర్పించారు. రెండు చోట్ల జరిగిన వేడుకల్లో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వెంటనే కులగణన చేయాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో చెప్పినట్లుగా 42శాతం రిజర్వేషన్లను బీసీలకు కేటాయించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం



రైల్వే గేట్ వద్ద రోడ్డును మూసివేసిన అధికారులు

దేవరకద్ర రూరల్: అధికారుల నిర్లక్ష్యం– ప్రజలకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కౌకుంట్ల మండల పరిధిలోని వెంకటగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారి వద్ద ఉన్న రైల్వే గేట్‌ను మూసివేసి, అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందు కోసం దాదాపు 6 నెలల క్రితం ఎలాంటి రాకపోకలు కొనసాగకుండా, పనులు పూర్తి అయ్యే వరకు అక్కడ ఉన్న రహదారిని మట్టి వేసి పూర్తిగా మూసివేశారు. ప్రయాణం కోసం వెంకటగిరి– పేరూర్ గ్రామాల మీదుగా ప్రత్యామ్నయంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. ఆత్మకూర్, కొత్తకోట వంటి పట్టణాలతో పాటు అన్ని గ్రామాలకు చేరుకునేందుకు ఈ దారే ప్రధాన ఆధారం. దీంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. పూర్తిగా బురదమయంగా మారింది. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వాపోతున్నారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు అండర్ బ్రిడ్జి పనులు కూడా ప్రారంభం కాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



నీటితో నిండిపోయిన రహదారి



పూర్తిగా గుంతలమయంగా మారిన రహదారి

మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం



మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే, మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా చీఫ్ జి.క్రిష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రం కుర్వినిశెట్టికాలనీలోగల అక్షర స్కూల్‌లో ఆదివారం జీకే షోటోకాన్ పట్టణ అధ్యక్షుడు, మాస్టర్ రాజు ఆధ్వర్యంలో కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్ణయ్య పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కోరారు. కరాటే మాస్టర్ రాజు మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ బెల్టులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకోండి

మహమ్మదాబాద్: ఇప్పటికీ రుణమాఫీ లబ్ధిపొందని రైతులు వెంటనే వ్యవసాయాధికారులకు దరఖాస్తులు పెట్టుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు విషయంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని అధైర్యపడవద్దని రైతులకు సూచించారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు చేపట్టాలి

పాలమూరు: ఈ ఏడాది గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో చేపట్టాలని.. మండపాల నిర్వాహకులు బాధ్యతతో వేడుకలు పూర్తి చేయాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. విశ్వ హిందూ పరిషత్, పాలమూరు గణేష్ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నవరాత్రి ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఉత్సవ కమిటీ సలహాలు, సూచనలు ప్రతి మండప నిర్వాహకులు పాటించాలన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాల్లో రాజకీయ ప్రమేయం ఉండరాదని, ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అవకాశం డిసెంబర్ 3 నాడే వచ్చిందన్నారు. ఐక్యమత్యంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండగ నిర్వహించుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు మద్ది యాదిరెడ్డి, లక్ష్మణ్ యాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థికి అభినందన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో ఈనెల 11న శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే టోర్నీ నిర్వహించారు. కాగా పోటీల్లో కటాస్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన బ్లాక్‌బెల్టు విద్యార్థి శివశంకర్‌ను ఆదివారం ఎంపీ డీకే అరుణ అభినందించారు. అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు

జడ్చర్ల టౌన్: కిష్టంపల్లి శివారులో సంతు గురు రవిదాస్ ఆలయ పునర్ నిర్మాణం చేయనున్నట్లు.. విశ్వగురు రవిదాస్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్ మహారాజ్ తెలియజేశారు. ఆదివారం కిష్టంపల్లిని సందర్శించిన అనంతరం ఇందిరానగర్‌లో ఉమ్మడి ఆనంద్ నివాసంలో ఈ మేరకు చర్చలు నిర్వహించారు. 14ఏళ్ల కిందట గుట్టపై ఆలయ నిర్మాణం చేసినప్పటికీ.. గుట్టను చదును చేయటం వల్ల ఆనవాళ్లు లేకుండా పోయాయన్నారు. తిరిగి నిర్మాణం చేపట్టాలన్న గ్రామస్తుల కోరిక మేరకు ఆలయ ప్రాంతాన్ని సందర్శించినట్లు తెలిపారు. పోలె నర్సింహులు, మల్లేష్, వెంకటేశ్, రాజు, ప్రవీణ్, ఎర్ర ఆనంద్ తదితరులు సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు.

అ'పూర్వ' సమ్మేళనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ హైస్కూల్‌లో 1990 బ్యాచ్‌కి చెందిన పదోతరగతి విద్యార్థులు సుమారు 150 మంది ఆదివారం ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అందరూ వినయ, విధేయతలు, క్రమశిక్షణతో మెలిగి జీవితంలో వివిధ రంగాల్లో స్థిరపడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హెచ్‌ఎం ఎం.ఎ.బాసిత్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు తొలగింపు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మూడో వార్డు పరిధిలోని శ్రీబృందావన్‌కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కొన్ని నెలలుగా ఎక్కడబడితే అక్కడ ఇళ్ల నుంచి వచ్చే మురుగు కాస్తా గుంటలుగా తయారయ్యాయి. దీంతో ఇటీవల కలెక్టర్‌కు 'ప్రజావాణి'లో కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది ఆదివారం అక్కడికి వెళ్లి జేసీబీతో కాల్వలు తవ్వి మురుగు గుంటల్లో నీరు నిల్వ ఉండకుండా ముందుకు వెళ్లేలా చేశారు.

రోడ్డు మరమ్మతు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

నవాబుపేట: మండల పరిధిలోని లింగంపల్లి కిషన్‌గూడ రోడ్డు ఎక్కడికక్కడ గుంతలు పడి ఇబ్బందిగా మారిన నేపథ్యంలో ఇటీవల 'అడుగుకో గుంత ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. దీంతో తమ సమస్య తీరనుందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సాక్షి పత్రికకు ధన్యవాదాలు తెలిపారు.



లింగంపల్లి - కిషన్‌గూడ రోడ్డు మరమ్మతు పనులు

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా గుంత

భూత్పూర్: మున్సిపాలిటీలోని రాజీవ్‌స్వగృహ ఎదుట రహదారి మధ్యలో వారం రోజుల క్రితం గుంతను తవ్వి వదిలేశారు. అక్కడ గుంత ఉన్నట్లు సూచిక బోర్డు సైతం ఏర్పాటు చేయలేదు. డివైడర్ మధ్యలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడానికి గుంతలు తవ్వారు. అయితే ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు ఈ దారిలో రాకపోకలు సాగిస్తాయని.. వెంటనే తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని అభిప్రాయపడుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి రమేష్, డీఈ, ఆర్‌అండ్‌బీ, మహబూబ్‌నగర్ | ఫోన్‌నంబరు 95050 88195

29న మున్సిపల్ కార్యాలయం ముట్టడి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జడ్చర్ల టౌన్: సమస్యల పరిష్కారం కోసం 21రోజులుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని.. ఇలాగే వ్యవహరిస్తే ఈ నెల 29న మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి హెచ్చరించారు. ఆదివారం జడ్చర్ల గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమస్యలు పరిష్కరించకపోగా యూనియన్ నాయకులను పనిలో నుంచి తొలగించినట్లు కమిషనర్ కార్మిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కమిషనర్‌పై వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు మహేష్, కార్మికులు కేశవులు, కృష్ణ, సాగర్, నర్సింహులు, రమేష్, యాదయ్య, ఆంజనేయులు, విజయ్, వినోద్, అంజమ్మ, యాదమ్మ, స్వరూప, లక్ష్మమ్మ, శివ, భీమమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.